క్లుప్తంగా

నేడు మండపేటలో 'ఆసరా' చెక్కుల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని ధర్మగుండం చెరువు వద్ద గల శ్రీసీతారామ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పట్టణానికి చెందిన వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు నాలుగో విడత రుణమాఫీ లబ్ధి పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ బి.రాము శనివారం తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించే సమావేశానికి లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పాలసేకరణ పరికరాల పంపిణీ

రాయవరం: జగనన్న పాల వెల్లువ పథకంలో భాగంగా శనివారం పాల సేకరణ కేంద్రాలకు పాల సేకరణ పరికరాలను పంపిణీ చేశారు. రాయవరం, సోమేశ్వరం, వెదురుపాక, నదురుబాద తదితర గ్రామాల్లో పాలశీతలీకరణ పరికరాలను అందజేశారు. ఆటోమేటెడ్ మిల్క్ కలెక్షన్ యూనిట్‌ను ఆయా పాల సేకరణ కేంద్రాలకు అందజేశారు. ఒక్కో యూనిట్ విలువ రూ.3 లక్షలు వరకు ఉంటుంది. రాయవరంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ చేతుల మీదుగా ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్లను ప్రమోటర్స్‌కు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగశ్రావణి, పంచాయతీ కార్యదర్శి పల్లేటి వెంకటరత్నం, ఆర్బీకే సెక్రటేరియట్స్ తదితరులున్నారు.

ఎరువుల యాజమాన్యంపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: వరి సాగులో ఎరువుల యాజమాన్యంపై రైతులు తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శనివారం మండలంలోని చేదువాడ, శీల, మంజేరు తదితర గ్రామాల్లో ఏట పంట పొలాలను సందర్శించి క్షేత్రస్థాయిలో రైతులకు పలు సూచనలు అందించారు. ఆయన మాట్లాడుతూ పంటలపై రైతులు అవసరాన్నిమించి ఎరువులు, పురుగు మందులు వాడటం అనర్థాలకు దారి తీస్తుందన్నారు. పంటలకు సోకు తెగుళ్ల, వాటి ఉధృతి, పంట స్థితిగతులకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులు వాడాలన్నారు. రెండు, మూడు రకాల మందులను కలిపి వాడుతుండటంతో ఏ మందు పనిచేయక వృథా వ్యయాలు అవుతున్నాయన్నారు. ఫలితంగా ఖర్చు పెరిగి రైతులు నికర ఆదాయం తగ్గుతుందన్నారు. రైతులు పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ మేలైన దిగుబడులు సాధించాలన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

కపిలేశ్వరపురం: గర్భిణుల ఆరోగ్యంపై వారి సహాయకులు అవగాహనతో మెలగాలని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. అంగర పీహెచ్‌సీలో శనివారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిబిరంలో 70 మంది గర్భిణులను పరీక్షించారు. వారిలో హైరిస్క్ కేసులుగా 12 మందిని గుర్తించి మెరుగైన చికిత్స కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కపిలేశ్వరపురం-2 ఎంపీటీసీ శీలం భాస్కరరావు గర్భిణులకు పండ్లు, బిస్కెట్, రొట్టెలు తదితర పోషకాహారాన్ని అందజేశారు. ఆయనను వైద్యాధికారి రత్నకుమారి, ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లిఖార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ తాతపూడి మేరీ, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు అభినందించారు.

ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరింది

- మళ్లీ సీఎంగా రాష్ట్రానికి జగన్ ఎంతో అవసరం
- అత్యధిక మెజార్టీతో గెలిపించండి
- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ సూర్యప్రకాష్

రామచంద్రపురం: అయిదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో నవరత్న పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకంతో లబ్ధి చేకూరిందని, రాష్ట్రంలో సంక్షేమ పథకాలు యథావిధిగా అమలు కావాలంటే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవటం ఎంతైనా అవసరం ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని 9వ వార్డు జల్లిపేట, శాంతినగర్‌లలో ఇంటింటి ప్రచారాన్ని శనివారం సూర్యప్రకాష్ నిర్వహించారు. సూర్యప్రకాష్‌కు జల్లిపేటలో ఎస్సీ కమ్యూనిటీ హాలు సమస్యను స్థానిక ప్రజలు వివరించారు. స్థానిక పెద్దలతో ఆయన చర్చించి పరిష్కారమయ్యే విధంగా అధికారులతో మాట్లాడారు. అనంతరం శాంతినగర్‌లో ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించే డ్రైన్‌కు శంకుస్థాపన చేసి పూజలో పాల్గొన్నారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించడం ద్వారా ప్రజల్లో మంచి ఆదరణ చూరగొన్నారన్నారు. దీంతో రాబోయే ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా అవడం ఖాయంగా కనిపించటంతో ప్రతిపక్షాలు ఏదోఒక రకంగా కుట్రలు చేసి పొత్తులతో వస్తున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరితే తనను ఆశీర్వదించాలని సీఎం జగన్ కోరుతున్నారని, కానీ ప్రతిపక్ష టీడీపీకి మాత్రం ఇది చేశాం మాకు ఓటు వేయండని అడిగే అర్హత లేదని సూర్యప్రకాష్ విమర్శించారు. లబ్ధి చేసి ఓటు వేయాలని ప్రతి ఇంటికీ వెళ్లి కోరుతున్న పార్టీ దేశంలో ఎక్కడా లేదని అదీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధతని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కోటి శ్రీకన్య, పట్టణ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు కేతా శ్రీను, కేతా సుజాత, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, కోఆప్షన్ మెంబర్ ఎం.మస్తాన్, స్థానిక నాయకులు జుత్తుక గులాం బాష, టేకు మోడీ శ్రీనివాస్, పితాని నరసింహారాజు తదితరులు పాల్గొన్నారు.


పట్టణంలోని 9వ వార్డులో ఇంటింటా పర్యటనలో వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు

సీఎం జగనన్నతోనే సంక్షేమ పాలన

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమవుతుందని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. మండలంలోని తణుకువాడ, శలపాక, గొల్లపాలెం, ఆర్యావటం, బందనపూడి తదితర గ్రామాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా పర్యటించి జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారికి కలిగిన లబ్ధిని వివరించారు. ఆర్యావటంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి అనుగుణంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి మంచి పథకాలను రూపొందించడమే కాకుండా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వాటిని లబ్ధిదారులకు అందజేయటంలోనూ సఫలీకృతులయ్యారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి రావడం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు ఫ్యాను గుర్తుపై ఓటువేసి జగనన్నను గెలిపించాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మాత భారతీ, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, ఎంపీటీసీ, పీఏసీఎస్ చైర్మన్ కురుపూడి సూర్యనారాయణ, మండల పార్టీ యువజన విభాగ కన్వీనర్ పెంకే వెంకటరమణ, మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, గుంటూరి అప్పారావు, టేకుమూడి దుర్గారావు, కంచి ఏసునందం, కాకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఆర్యావటంలో గ్రామస్తులకు వివిధ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తున్న నాయకులు

సత్తెమ్మతల్లిని దర్శించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం 20వ వార్డులోని వైఎస్సార్ కాలనీలో ఉన్న వరాల సత్తెమ్మ తల్లిని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాలంకి కమల, యాదగని చంటి, గాజుల శ్రీను, పసుపులేటి వెంకటరమణ, గండి నాగేశ్వరరావు, కొమ్మోజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి

శాంతిభద్రతలకు విఘాతం కలిగితే ఉపేక్షించం

రాయవరం: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్, రాయవరం ఎస్సై జి.నరేష్ హెచ్చరించారు. మండలంలోని మాచవరం, సోమేశ్వరం గ్రామాల్లో శనివారం ఎన్నికల విధుల నిమిత్తం వచ్చిన స్పెషల్ పార్టీ పోలీసులతో కలసి కవాతు నిర్వహించారు. సీఐ, ఎస్సై మాట్లాడుతూ త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, అటువంటి గ్రామాల్లో అల్లరి మూకలపై నిఘా ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కవాతులో స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

మాచవరంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమంలో తోట త్రిమూర్తులు

రాయవరం: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి జగనన్నతోనే సాధ్యమైందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండలంలోని మాచవరంలో శనివారం జరిగిన రూ.5.10 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల భూమిపూజ, ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా మరోమారు సీఎం జగన్‌ను గెలిపించుకోవాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమాజంలో అన్ని వర్గాల వారికి అందించిన సంక్షేమం, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన అందిస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తెరగాలన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. మాచవరం గ్రామం అభివృద్ధికి చిరునామాగా నిలిచిందన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ సీపీ నేత సత్తి వెంకటరెడ్డి ఆర్థిక సహకారంతో రూ.20లక్షలతో ఆడిటోరియం నిర్మించడంపై ఎమ్మెల్సీ త్రిమూర్తులు అభినందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కృషి, అందించిన సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోగలిగామన్నారు. సమావేశంలో పారిశ్రామికవేత్త సబ్బెళ్ల కాశీఈశ్వరరెడ్డి, నాయకులు ద్వారంపూడి చినరెడ్డి, తాడి నారాయణరెడ్డి తదితరులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి త్రిమూర్తులు చేసిన కృషిని వివరించారు. త్రిమూర్తులు వంటి నాయకుడు నియోజకవర్గానికి లభించడం అదృష్టమన్నారు.

రూ.5.10కోట్లతో అభివృద్ధి పనులు

మండలంలోని మాచవరంలో రూ.5.10కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ త్రిమూర్తులు భూమి పూజ చేయగా, పలు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు రూ.7.87 కోట్ల ఆసరా చెక్కును ఎమ్మెల్సీ త్రిమూర్తులు అందజేశారు. అభివృద్ధి కార్యక్రమాల్లో సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ పలివెల శోభన, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ సత్తి ఈశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లిడి రామారెడ్డి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, పీఏసీ చైర్మన్ వెలగల అచ్యుతరామారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు కత్తుల అప్పారావు, పలివెల సతీష్, ఎండీ శ్రీను, ద్వారంపూడి ఆదిరెడ్డి, మేడపాటి వెంకటరెడ్డి, తమలంపూడి సత్యనారాయణరెడ్డి, ఎం.సూర్యం, వి.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాచవరంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

గడప గడపకూ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కె.గంగవరం: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, రాజానగరం పరిశీలకుడు వట్టికూటి సూర్యచంద్ర రాజశేఖర్ అన్నారు. మండలంలోని కె.గంగవరంలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను గురించి వివరించి పత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి ఇంటికీ సంక్షేమం అందించాలనే ఉద్దేశంతో నవరత్నపథకాలు ప్రవేశపెట్టిందని దానిలో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా మధ్యవర్తిత్వం లేకుండా అందిస్తుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఏ పథకం అందాలన్నా, సమస్య పరిష్కారం కావాలన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు, జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎవరి వద్దకు వెళ్లకుండా ఎవరి రికమండేషన్ లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందుతున్నాయన్నారు. సమస్యలు ఉంటే ఆయా గ్రామ సచివాలయాల్లోని సిబ్బందికి చెప్పినా, ఆ కుటుంబ పరిధిలోని వలంటీర్ దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రతి పేదవాడి కుటుంబంలో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని రానున్న కాలంలో ప్రతి ఒక్కరూ జగన్‌ని ఆశీర్వదించాలని కోరారు. నియోజకరవ్గ సమన్వయకర్త చింతలపాటి శ్రీనివాసరాజు, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, ఎంపీపీ పంపన నాగమణి, జిల్లా వ్యవసాయ సలహా కమిటి డైరెక్టర్ బత్తుల అప్పారావు, యువజన నాయకులు జత్తుక శ్యాంప్రసాద్, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకే ప్రజల మద్దతు

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలో ప్రజల సంపూర్ణ మద్దతు వైఎస్సార్ సీపీకే ఉందని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చింతలపూడి శ్రీనివాసరాజు అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గడప గడపకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ఆయా కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పంపించిన లేఖలను మండలంలోని జగన్నాయకులపాలెంలో ఎంపీపీ అంబటి భవాని, గ్రామ సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ, ఎంపీటీసీ బళ్ల సుధాకరరావులతో కలసి ఆయన లబ్ధిదారులకు అందజేశారు. శ్రీనివాసరాజు మాట్లాడుతూ దేశం మొత్తం మీద ప్రజలకు ప్రభుత్వం తరపున చేసిన మంచిని తెలియజేసి, మీ కుటుంబాలు మంచి జరిగిందని భావిస్తేనే తమకు ఓటు వేయాలని కోరడం ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. ప్రజలు కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, సర్పంచ్‌లు నక్కిన దొరబాబు, అంబటి తుకారం, గ్రామ కన్వీనర్లు సాదే రాజేష్‌కుమార్, బోణం వీరబాబు, అల్లక సత్యవిజయభాస్కర్, నాయకులు అనిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.


కె.గంగవరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న వట్టికూటి రాజశేఖర్, ఎంపీపీ నాగమణి తదితరులు


జగన్నాయకులపాలెంలో సీఎం పంపిన లేఖలను లబ్ధిదారులకు అందజేస్తున్న నాయకులు

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- యువనేత తోట పృథ్వీరాజ్
- పసలపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం

రాయవరం: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ పేర్కొన్నారు. పసలపూడిలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతో పాటుగా, అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని సంక్షేమాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశ ప్రజలను ఆకర్షిస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై దేశవ్యాప్తంగా చర్చించుకుంటున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రజలు కూడా గుర్తించారన్నారు. అందుకే ప్రజల నుంచి వస్తున్న స్పందన దీనికి నిదర్శనంగా పేర్కొన్నారు. అనంతరం ఆయన గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి పద్మావతి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, పారిశ్రామికవేత్త చైతన్య రాజబాబు, ఎంపీటీసీ కర్రి విజేత, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చింతా రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మల్లిడి రామారెడ్డి, పోతంశెట్టి సత్యనారాయణరెడ్డి, మండల బూత్ కన్వీనర్ చింతా వెంకటసుబ్బారెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ తవిటికి రత్నకుమార్, కోకన్వీనర్ చింతా సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పసలపూడిలో పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్ తదితరులు